ఈనాడు
వనపర్తి
మంగళవారం అక్టోబరు 22, 2024
5


అమరవీరుల స్తూపానికి వందనం చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్

పోలీసుల సేవలు వెలకట్టలేనివి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: సమాజ భద్రత కోసం ప్రాణాలు లెక్క చేయకుండా అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ రావుల గిరిధర్, పోలీసు అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ పలు సందర్భాల్లో పోలీస్ వ్యవస్థ కీలకమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఓపెన్‌హౌజ్ కార్యక్రమంలో విద్యార్థులకు జాగిలాలు, తుపాకుల గురించి ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాందాస్‌తేజ, సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు సీఐలు నాగభూషణంరావు, రాంబాబు, శివకుమార్, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించండి: కలెక్టర్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రజాసమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు నగేశ్, సంచిత్‌గంగ్వార్‌లు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులు సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి 50 ఫిర్యాదులు వచ్చాయి.

రెండు పడక గదుల ఇళ్ల మంజూరుకు వినతి

రహదారి విస్తరణలో భాగంగా మా ఇల్లు పూర్తిగా పోయింది. నా భర్త ఎం.డీ.అబ్దుల్ 12 సంవత్సరాల కింద మృతి చెందాడు. నాకు ముగ్గురు పిల్లలున్నారు. ఇల్లు పూర్తిగా పోవడంతో అద్దె ఇల్లు తీసుకొని నివాసముంటున్నాం. రెండు పడక గదులు ఇల్లు ఇస్తామని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలి.

-ఫాతిమాబేగం, పెబ్బేరు

బీటీ రహదారిని నిర్మించాలి

నేషనల్ హైవే 44 నుంచి బీటీ రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి, గుత్తేదారు పనులు చేపట్టడం లేదు. రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు రహదారి నిర్మించాలని అధికారులు, గుత్తేదారుకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

-సంకిరెడ్డిపల్లి గ్రామస్థులు

బీసీ కులాల్లో ఏబీసీడీఇలుగా గుర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపడుతున్న నేపథ్యంలో 130 బీసీ కులాల్లో 120 కులాలు నిరాదరణకు గురయ్యాయి. బీసీలోని ఉప కులాలను ఏబీసీడీఇలుగా గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా చిన్న కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించేలా చర్యలు తీసుకోవాలి.

-శంకర్, తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యదర్శి

జల విద్యుదుత్పత్తికి 34,559 క్యూసెక్కుల వరదనీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు వద్ద వరదనీటి ఉద్ధృతి 1,13,000 క్యూసెక్కులు ఉండగా ఎగువ, దిగువ జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు 34,559 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఐదు, దిగువన ఆరు యూనిట్ల ద్వారా ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన 3.773, దిగువన 4.112 మిలియన్ యూనిట్ల జల విద్యుత్తు ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం జల విద్యుత్తు ఉత్పత్తి ఎగువన 293.783, దిగువన 274.574 మిలియన్ యూనిట్లుగా నమోదయ్యిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

రైతేరాజు 6 లో..

అక్రమాల దస్త్రం మరుగున పడినట్లేనా?

ధరూరు న్యూస్‌టుడే: గొర్రెల పంపిణీపై గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. నెలలు గడుస్తున్నా కొర్రీ అక్రమాలపై విచారణ ఊసే కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర పశుసంవర్ధక అభివృద్ధి సంస్థ సీఈవో మరో ముగ్గురు అధికారుల అరెస్టులు తప్ప పెద్దగా విచారణలో పురోగతి కనిపించడం లేదు. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో రీసైక్లింగ్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. అధికారులతోపాటు కొందరు దళారులు, ఇతర ప్రాంతాల వారు కూడా ఈ అవకతవకల్లో ఉన్నట్లు స్పష్టం. కాని క్షేత్ర స్థాయిలో దీనిపై విచారణ చేపట్టడం లేదు. దీంతో అక్రమార్కులపై చర్యలు ఉంటాయా? లేదోనన్న? అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి.


లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలు


గొర్రెల్ని సక్రమంగా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అప్పట్లో ఓ అధికారిని సస్పెండ్ చేశారు. గద్వాల జిల్లాలో అధికారులు అనంతపురం వెళ్లి ఏజెంట్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులున్నాయి. నాడు అక్కడ పని చేసిన ఏడీ డబ్బు పంపిణీ వ్యవహారంలో గొడవకు దిగినట్లు ఆరోపణలొచ్చాయి.

కాగ్ గుర్తించిన అంశాలు..

గొర్రెల పంపిణీలో జరిగిన అనేక అక్రమాలను కాగ్ గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 70,688 యూనిట్లు పంపిణీ చేశారు. దీని కోసం ప్రభుత్వ నిధులు రెండు విడుతల్లో రూ.730 కోట్ల వరకు ఖర్చు చేశారు. కాగ్ పరిశీలనలో మహబూబ్‌నగర్ జిల్లాలో 108 గొర్రెలను ఒక కారులో తరలించినట్లుగా రికార్డుల్లో పొందుపరిచినట్లు గుర్తించింది. ఇక్కడ రవాణా వాహనం టీఎస్‌ఎం నంబరు బదులు కారు నంబరు నమోదు చేశారు.

● ఒకే సమయంలో ఒకే వాహనంలో వేర్వేరు ప్రాంతాల నుంచి గొర్రెలు తరలించినట్లు రికార్డుల్లో నమోదై ఉంది. శ్రీకాకుళం, కడప, కర్నూలులోని పలు ప్రాంతాల నుంచి కూడా ఇదే వాహనంలో తరలించినట్లు రికార్డుల్లో ఉంది.

● ధన్వాడ మండలానికి వచ్చిన



● వల నియోజకవర్గాల పరిధిలో విజిలెన్స్ విచారణలో వెలుగుచూసిన వాస్తవాలు అందరినీ విస్మయానికి గురి చేశాయి. చాలాచోట్ల యూనిట్లే కనిపించని దాన్ని విచారణలో గుర్తించారు. నాగర్ కర్నూల్ జిల్లా మాచర్ల కేంద్రంగా పెద్ద ఎత్తున రీసైక్లింగ్ జరిగినట్లు ఆరోపణలొచ్చాయి.

● వనపర్తి జిల్లాలో కొత్తకోట, మదనాపురం మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇద్దరు, మానవపాడు రాజాల్లో గొర్రెల రీసైక్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. అప్పట్లో క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు నివేదిక ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణగానీ అక్రమార్కులపై చర్యలుగానీ లేవు. అసలు పంపిణీలో అక్రమాలపై విచారణ జరుగుతుందా దస్త్రం మూసేస్తారా? అన్నదానిపై మాకే స్పష్టత లేదని ఉమ్మడి జిల్లాలో పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పశువైద్యాధికారి చెప్పుకొచ్చారు.

రెండు విడతల్లో పంపిణీ చేసిన గొర్రెలు: మహబూబ్‌నగర్ 16,721 | నాగర్‌కర్నూల్ 19,127 | వనపర్తి 14,511 | గద్వాల 10,525 | నారాయణపేట 9,804

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి


మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయిలు జీవిత లక్ష్యాలను చేరుకోవడం లేదని, శారీరక వృద్ధిని కోల్పోయి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేస్తే 1098 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మమ్మ, డీసీపీవో రాంబాబు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 8 ఫిర్యాదులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పోలీసు ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం వనపర్తి ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరు భూ ఫిర్యాదులు, రెండు కుటుంబ తగాదాలు, పరస్పర ఫిర్యాదులొచ్చాయి.

పీయూ అభివృద్ధికి కృషి

ఉప కులపతి డా.జీఎన్ శ్రీనివాస్


వీసీ డా.జీఎన్ శ్రీనివాస్‌కు మొక్క అందిస్తున్న రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉపకులపతి (వీసీ) డా.జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విశ్వవిద్యాలయానికి రాగా రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీయూకు తాను ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. 29 ఏళ్ల నుంచి తాను బోధనా రంగంలోనే ఉన్నానని, విశ్వవిద్యాలయాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తనకు తెలుసని పేర్కొన్నారు. ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే ఉంటారని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. విద్యతోపాటు సహ పాఠ్య అంశాలు, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయటంపై దృష్టిసారిస్తామని తెలిపారు. తరగతులు, వసతి గృహాలు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిపాలన, పర్యవేక్షణ తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. వచ్చే ఏడాది న్యాయ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. పీయూ అభివృద్ధికి ప్రభుత్వ, తాత్కాలిక, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగుల సహకరించాలని, ఎలాంటి సమస్య ఉన్నా.. నేరుగా తన వద్దకు రావచ్చని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, అధికారులు విజయలక్ష్మి, శాంతిప్రియ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రవీణ, ప్రిన్సిపల్స్ చంద్రకిరణ్, నూర్జహాన్, బషీర్ అహ్మద్, వెంకట్‌రెడ్డి, భగవంతురెడ్డి, భాస్కర్, జైపాల్‌రెడ్డి, కుమారస్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా

ఆర్బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు వైద్యసేవలు

న్యూస్‌టుడే, పాలమూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే) అండగా నిలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 7, నాగర్‌కర్నూల్‌లో 10, నారాయణపేటలో 5, వనపర్తిలో 8, జోగులాంబ గద్వాల జిల్లాలో 5 చొప్పున మొత్తం 35 ఆర్బీఎస్‌కే వైద్య బృందాలు పని చేస్తున్నాయి. ప్రతి బృందంలో ఇద్దరు వైద్యులు (ఆడ, మగ), ఒక ఫార్మసిస్టు, ఏఎన్ఎం ఉంటారు. వారికి వాహన సౌకర్యం కూడా ఉంటుంది. బృందాల సభ్యులు వారంలో ఐదు రోజులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు.

రక్తహీనత బాధితులే ఎక్కువ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,48,556 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అనేక రకాల అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న 6,143 మంది చిన్నారులను గుర్తించారు. వారిని మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డైక్)కు పంపించారు. వివిధ విభాగాలకు చెందిన 13 మంది వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారుల్లో తీవ్ర రక్తహీనత, దంత సంబంధ సమస్యలు, పోషకాహారలోపం ఎదుర్కొంటున్నవారు ఎక్కువ మంది ఉన్నారు.


మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : మా వైద్య బృందాలు రోజూ పాఠశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రతి శనివారం అనారోగ్య బాధితుల వివరాలు మాకు సమర్పిస్తారు. చిన్నారులను కూడా మహబూబ్‌నగర్‌కు తీసుకొస్తారు. వారి అనారోగ్య సమస్యలు పూర్తిగా నయమయ్యే వరకు మెరుగైన చికిత్సలు అందిస్తాం. ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం.

- దేవీదాసు, ఆర్బీఎస్‌కే మేనేజర్, మహబూబ్‌నగర్ జిల్లా

చిన్నారుల అనారోగ్య సమస్యలివే..

అనారోగ్య సమస్య	బాధితులు
తీవ్ర రక్తహీనత	692
దంత సమస్యలు	682
పోషకాహారలోపం	386
దృష్టిలోపం	156
మాట్లాడలేకపోవడం	156
రుతుచక్ర సమస్యలు	151
నరాలు, ఎముకలు	145
బుద్ధి మాంద్యం	51
ప్రవర్తన సమస్యలు	39
గుండె సమస్యలు	32
అభ్యసన వైకల్యాలు	26
నిరాసక్తత	18
గ్రహణ మొర్రి	14
రక్తమార్పిడి	07
వంకర కాళ్లు	06
కర్ణభేరి సమస్యలు	02

కార్మికుల కష్టాన్నీ వదలం..!

త్రిఫ్టు నిధిలో దళారులు, అధికారుల చేతివాటం

రాజోలి, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించిన త్రిఫ్టు పథకం నిధుల్లో పలువురు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,240 జియో ట్యాగ్ మగ్గాలుండగా, 7,150 మంది కార్మికులు త్రిఫ్టు ఫండ్(నేతన్నకు చేయూత) పథకం ద్వారా ఆర్డీ-1 ఖాతాలో కొంత డబ్బు జమ చేస్తే.. ప్రభుత్వం దానికి రెండింతలు ఆర్డీ-2 ఖాతాలో జమ చేసింది. ఆగస్టుతో మూడేళ్ల కాల పరిమితి తీరడంతో మూడింతల డబ్బును అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు రూ.35 కోట్లకు పైగా నిధులు కార్మికుల సేవింగ్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ పథకం నిధులను తీసుకునేందుకు జిల్లా అధికారులు క్లియరెన్స్ లెటర్లు ఇవ్వడంతో కొందరి చేతివాటం ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కొందరు దళారులు కార్మికులు కట్టిన డబ్బు బ్యాంకుల్లో జమ చేయకుండా వాడుకున్నారు. మరికొందరు వచ్చిన డబ్బులో కొంత వసూలు చేస్తుండటంతో నేతన్నలు లబోదిబోమంటున్నారు. రాజోలిలో ఓ వ్యక్తి కార్మికుల నుంచి ప్రతి నెలా డబ్బు వసూలు చేసి కట్టకుండా సొంతానికి వాడుకున్నాడు. 50 మందికి పైగా నేతన్నలకు సంబంధించిన రూ.లక్షకు పైగా నగదు వాడుకున్నట్లుగా సమాచారం. ఇవి కట్టకపోవడంతో ప్రభుత్వం ద్వారా అందాల్సిన రెండింతల డబ్బు(రూ.2లక్షలు) అందకుండా పోయాయి. ఇలా మొత్తం రూ.3 లక్షలు నష్టపోయారు.

డబ్బు వసూలు : బ్యాంకు అధికారులు ఒక్కో ఖాతా పరిశీలించి నగదు జమ చేయాల్సి ఉండటంతో జాప్యం జరుగుతోంది. ఇదే అదునుగా దళారులు రంగంలోకి దిగారు. ఇన్నాళ్లు బ్యాంకుల చుట్టూ తిరిగాం. తమకు కొంత డబ్బు ఇవ్వాలంటూ కార్మికులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వ సొమ్మే కదా.. తమకు ఖుషీగా కొంత ఇవ్వాలని శాఖ అధికారులు డబ్బు వసూలుకు పాల్పడుతున్నట్లు సమాచారం. గద్వాలలో కొందరు కార్మికుల నుంచి రూ.5-10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. కొందరు దళారులు కార్మికులకు తెలియకుండా నేతన్నల ఖాతాల్లో ప్రతి నెల డబ్బు కట్టినట్లు సమాచారం. ఒక్కో వ్యక్తి 20-50 ఖాతాల్లో డబ్బు కట్టడంతో ప్రస్తుతం రూ.లక్షలు తీసుకునేందుకు కొందరు బ్యాంకు, చేనేత అధికారులను మచ్చిక చేసుకునే పనిలో పడ్డట్లుగా తెలుస్తోంది. ప్రశ్నించిన కార్మికులకు మూడులో ఒక వంతు మీకు.. రెండు వంతులు మాకు అన్నట్లుగా చెబుతున్నారని కార్మిక వర్గాల్లో చర్చ జరుగుతోంది.

● త్రిఫ్టు పథకం నిధులకు సంబంధించి రూపాయి కూడా అధికారులు, దళారులకు చెల్లించొద్దు. కార్మికుల నుంచి ఎవరైనా వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. రాజోలిలో ఓ వ్యక్తి కొంత డబ్బు వాడుకున్నట్లుగా తమ దృష్టికి వచ్చింది. మిగిలిన ప్రాంతాల్లో వసూలు చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందలేదు.

-గోవిందయ్య, జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు

స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు

వనపర్తి న్యూటౌన్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు పారిశ్రామికవేత్తలతో మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని తేజ కన్వెన్షన్ హాల్‌లో స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. సదస్సులో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే ఔత్సాహికులకు శిక్షణ మొదలు రుణ సౌకర్యానికి అనుమతులు పొందుటకు, మార్కెటింగ్ ఏ విధంగా చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు ఎంపీ మల్లు రవి, మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు.


దస్త్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

విద్యా, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పేద ప్రజలకు వైద్యంతో పాటు విద్యార్థులకు విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన భారతీయ ఔషధీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటు కంపెనీల కన్నా ఈ కేంద్రంలో సగం ధరకే మందులు దొరుకుతాయన్నారు. రోగులు, ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న రోగులు, అవుట్ పేషెంట్‌లు, ఆరోగ్యశ్రీ, రెడ్‌క్రాస్ విభాగాలను పరిశీలించి దస్త్రాలను పరిశీలించారు. ఆయన వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగారావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంటల సర్వేపై చిక్కుముడి


సాగు పనుల్లో రైతులు (పాతచిత్రం)

కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుపై డిజిటల్ సర్వే చేయాలని ఏఈవో (వ్యవసాయ విస్తరణ అధికారు)లను ఆదేశించడంతో వారు నిరాకరించడం సర్వే సందిగ్ధంలో పడింది. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయంపై రూపొందించిన ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్న భూముల వివరాల్ని నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వేకు కేంద్రం నిధులు కేటాయించగా కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ ప్రత్యేక వాలంటీర్లను నియమించి సర్వే చేపడుతోంది. కాగా తెలంగాణలో మాత్రం ఏఈవోలే వీటిని చేయాలంటూ ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తున్న ఏఈవోలు విధులకు హాజరవుతున్నా గత నెల 24 నుంచి గైర్హాజరు వేస్తున్నారు. విధులను ఖాతారు చేయని అవుట్ సోర్సింగ్ ఏఈవోలను విధుల నుంచి తొలగిస్తామని మెమోలు జారీ చేశారు. దీంతో రెగ్యులర్ ఏఈవోల్లో ఆందోళన నెలకొంది. అయినప్పటికీ సర్వే మాత్రం ముందుకు సాగడం లేదు.

● గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న వారి వివరాలే కాకుండా సాగులోకి వస్తున్న భూములు, పంటలు వంటివి డిజిటల్‌లో నమోదు చేయడం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి పట్టు సాధించడం వీలవుతుందని ఈ సర్వేను నిర్దేశించారు. ఇప్పటి వరకు ధరణి నమోదు ఆధారంగా గ్రామాల్లో వీఆర్ఏ, కావలి కారు వంటివారి సహకారంతో రైతు చెప్పిన విధంగా పంటల సాగును వ్యవసాయశాఖ నమోదు చేసేది. వీటన్నింటికీ చెక్‌పెడుతూ సర్వే నంబర్, సాగు ఫొటో ఆధారంగా పంటలు నమోదు చేస్తారు. ఈ సర్వే వివరాల ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఇద్దామని యోచిస్తోంది.

ఒక్కరికి అసాధ్యమే ! : గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి అక్కడి నుంచే ఫొటోలతో ఆయా రైతు వివరాలను నమోదు చేయాలంటే ఒక్క ఏఈవోల తోనే సాధ్యమయ్యే పనికాదని వారు చెబుతున్నారు. తమకు సహాయంగా మరొకరిని ఇస్తే గాని గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేయలేమన్నది వారి వాదన. ఏఈవోలుగా స్త్రీలు పని చేస్తున్నారని ఒక్కరే అడవులు, చెరువులు, కుంటలు తిరుగుతూ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడం సులభమైన పని కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంటి అటవీ ప్రాంత వ్యవసాయ క్షేత్రాల్లో ఇది మరింత ఇబ్బందికరమని మహిళా ఏఈవోలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖలో 49 రకాల పనుల్ని చక్కబెడుతున్న తమకు డీటీఎస్ తీవ్ర ఇబ్బందులు కలిగించే అంశంగా వారు భావిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో వీరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదు. అందులోనే వ్యక్తిగత హాజరు నమోదు చేయాలని నిర్దేశించినప్పటికీ ఈ విధులకు దూరంగా ఉంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన భూమి వివరాలు...

జిల్లా	రైతులు	సాగు భూములు (ఎకరాల్లో)
నాగర్‌కర్నూల్	1,26.549	5,62,299
నారాయణపేట	1,38,267	4,64,440
జోగులాంబ గద్వాల	2,58,901	3,40,677
మహబూబ్‌నగర్	1,76,474	3,21,512
వనపర్తి	1,30,894	2,35,250
మొత్తం	8,31,085	19,24,178

కేంద్ర ప్రభుత్వ పథకాలపై జాతీయ పరిశీలకుల ఆరా

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: మండలంలోని దొంతికుంట తండా, రుక్కన్నపల్లి పంచాయతీలో జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ (ఎన్ఎల్ఎమ్) జాతీయ పరిశీలకులు పీబీ పాటిల్, ఎమ్.దేశ్‌పాండేలు సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం, జాబ్ కార్డులు, రైతుల పొలాల్లో నిర్వహించిన పనులు, ప్రధాన మంత్రి సడక్ యోజన, వన నర్సరీల నిర్వహణను వారు పరిశీలించారు. మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాల యూనిట్‌లు, వాటి సద్వినియోగం తదితర అంశాలను వారు పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. పంచాయతీలలో నిర్వహించే వివిధ 7రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎంపీడీవో వెంకటాచారి, ఏపీఎమ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


రుక్కన్నపల్లిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలిస్తున్న జాతీయ పరిశీలకులు

ఒక్కొక్కరుగా దూరమై.. జీవనం భారమై!

మానవీయం

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : అమ్మానాన్నలు, సోదరుడు, తాత, నానమ్మలను వరుసగా కోల్పోయి ఓ యువతి అనాథగా మిగిలిన దయనీయ గాథ ఇది. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన బి.రాములుది పేద కుటుంబం. ఆయనకు భార్య జయమ్మ, తండ్రి అనంతయ్య, తల్లి మాసమ్మ, కుమారుడు సాయికిరణ్, కుమార్తె స్నేహ ఉన్నారు. కూలి పనులతో వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగించే ఆ కుటుంబాన్ని మధుమేహం కబలించింది. తాము మధుమేహం బారినపడ్డామన్న విషయాన్ని రాములు, జయమ్మ ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే పరిస్థితి చేయిదాటి అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. 2014లో జయమ్మ చనిపోయారు. మరుసటి సంవత్సరం రాములు మరింత అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రి ఖర్చులకు ఎకరం పొలాన్ని అమ్మినా ఫలితం లేకపోయింది. 2016లో ఆయన మృతిచెందారు. అమ్మానాన్నలు లేకున్నా అన్న, తాత, నానమ్మ ఉన్నారని స్నేహ అనుకున్నంతలోనే మరొకరిని కోల్పోవాల్సి వచ్చింది. కుమారుడు, కోడలును కోల్పోయిన దిగులుతో వృద్ధుడైన అనంతయ్య 2017లో మరణించారు. కొంతకాలానికి అన్న సాయికిరణ్ అనారోగ్యం పాలయ్యారు. 2024 ఆగస్టు 26న ఆయన చనిపోయారు. వృద్ధాప్యంతో నానమ్మ మాసమ్మ 2024 సెప్టెంబరు 16న మరణించారు. నెల వ్యవధిలోనే అన్న, నానమ్మ దూరమయ్యారు.



తల్లిదండ్రుల చిత్రపటంతో స్నేహ

విధి పగబట్టినట్లుగా కుటుంబంలోని ఒకరి తర్వాత మరొకరిని.. మొత్తం ఐదుగురిని బలి తీసుకోవటంతో స్నేహ అనాథగా మారింది. ఆమెను తీవ్రంగా కుంగదీసింది. ప్రస్తుతం స్నేహ మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. ఉన్నత విద్య అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆమె కలలన్నీ కరిగిపోయి కన్నీరే మిగిలింది. కుటుంబ సభ్యులను తలచుకుని దుఃఖిస్తూ.. శిథిలావస్థకు చేరిన పాత పెంకుటిల్లులో బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అనాథగా మారిన స్నేహకు ప్రభుత్వం అండగా నిలవాలని, ఆమెను వసతి గృహంలో చేర్పించి ఉన్నత విద్య చదివించటంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బంతి తోట.. లాభాల బాట

రైతేరాజు

ధన్వాడ, న్యూస్‌టుడే : గాలి ఉన్నప్పుడే తూర్పార బట్టాలి అనే నానుడిని వంట బట్టించుకున్న నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన మహిళా రైతు పోలమోని లక్ష్మమ్మ.. బంతి పూలసాగులో ప్రణాళికతో ముందుకెళ్తూ ఏటా లాభాలు అందుకుంటున్నారు. ఈమెకు 2.30 ఎకరాల పొలం ఉంది. ఓ చోట రెండెకరాలు, మరో చోట 30 గుంటల భూమి ఉంది. ఇందులో అర ఎకరాలో బంతిపూలు సాగు చేశారు. బతుకమ్మ వేడుకలు ప్రారంభానికి నలభై రోజుల ముందు నారు నాటుతారు. పూల దిగుబడి అప్పటి నుంచి మొదలైతే దీపావళి, కార్తిక పౌర్ణమి వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది.

ఖర్చు రూ.20 వేలు.. లాభం రూ.50 వేలు: నారు నాటినప్పటి నుంచి పూలు చేతికి వచ్చే వరకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని లక్ష్మమ్మ తెలిపారు. తొలి కాపు పూలు విక్రయించగా చేతికి రూ.30 వేలు దక్కాయని, పెట్టుబడి పోగా రూ.పది వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం రెండో కాపులో పూలు విరగకాశాయని వీటిని విక్రయిస్తే కనిష్ఠంగా మరో రూ.40 వేలు లాభం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నీటి తడులు అందిస్తే మూడో కాపు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పూలకు డిమాండ్ ఉంటే మరో రూ.30 వేలు వస్తాయన్నారు. గతేడాది మూడు కాపులు బాగా కాశాయని ఆమె తెలిపారు.



తోటలో రైతు లక్ష్మమ్మ

గత ఏడాది రూ.లక్ష వరకు విక్రయాలు: నా పొలం పట్టణానికి సమీపంలో ఉండటంతో రోజూ నా భర్త ఉదయం, సాయంత్రం వెళ్లి పర్యవేక్షిస్తారు. బంతిపూల సాగుకు శ్రమ పడాల్సిన అవసరం ఉండదు. గతేడాది రూ.లక్ష వరకు విక్రయాలు జరిగాయి. పెట్టుబడి పోగా రూ.80 వేలు దక్కాయి. ఈసారి రెండో కాపు వరకు రూ.70 వేలు చేతికి దక్కుతాయి. మూడో కాపులో డిమాండ్ ఉంటే రూ.లక్ష వరకు అమ్మకాలు జరుగుతాయి.

- పోలమోని లక్ష్మమ్మ, మరికల్

ముర్రుపాలు దూడలకు మేలు

బాలానగర్, న్యూస్‌టుడే : లేగ దూడలకు పోషణపరంగా శ్రద్ధ తీసుకుంటే అవి సకాలంలో మంచి పాడిపశువులుగా ఎదుగుతాయని పశువైద్యాధికారి రఘురాం కుమార్ తెలిపారు. చూడి పశువులకు ఏడో నెల నుంచే అదనంగా దాణా ఇవ్వాలని సూచించారు. దూడల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందించేందుకు రోజుకు రెండు, మూడు సార్లు చొప్పున మొదటి మూడు రోజులు ముర్రుపాలు తాగించాలి. పుట్టిన గంటలోపే ఇవ్వాలి. తాగలేని దూడలకు తల్లి వద్ద నిలబెట్టి తాగేలా సహకరించాలి. లేదంటే సీసాలో పోసి పాల పీక అమర్చి తాపాలి. వీటిలో శక్తినిచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా దూడలను వ్యాధుల బారి నుంచి రక్షించే 'అంటినాడిస్' ఇందులో ఉంటాయి. వీటిని తాగని దూడల్లో పారుడు వ్యాధులు, ఏలిక పాములు ఆశిస్తాయి. వీటి వల్ల దూడలకు మలబద్ధకం సమస్య ఉండదని రఘురాం కుమార్ తెలిపారు.

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మేలైన వంగడాల ఎంపిక కీలకం

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : రబీలో మేలైన వంగడాలు ఎంచుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేశ్ సూచించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురవడంతో ఎలాంటి నీటి సమస్య ఉండదని తెలిపారు. రైతులు ప్రస్తుతం నాణ్యమైన ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలు ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.



ఉల్లి సాగు

- వరిలో అగ్గి తెగులును తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఎంచుకోవాలి. ఇందులో స్వల్పకాలిక (120 రోజులు) రకాలు ఎంచుకుంటే మేలు. కాటన్ దొర సన్నాలు (ఎంటీయూ-1010), విజేత (ఎంటీయూ-1001), ఐఆర్-64, ప్రభాత్ (ఎంటీయూ-3626), నెల్లూరి మసూరి (ఆర్‌పీఎన్‌ఆర్-34449), తెల్లహంస (ఆర్‌ఎన్‌ఆర్-10754), ఎర్రమల్లెలు (డబ్ల్యూఎల్-20471), జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798) మంచి ఫలితాలు ఇస్తాయి.
- జగిత్యాల సాంబ, అంజన, శ్వేత, తరంగ్, తెలంగాణ సోనా, బతుకమ్మ వంటి రకాలు సాగుకు అనుకూలం.
- మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు శనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, ఆవాలు, రాగి, తెల్లజొన్న, ఉలువ, పెసర వంటి పంటలు సాగు చేసుకోవచ్చు. అపరాల సాగు లాభదాయకంగా ఉంటుంది.
- ఉల్లి సాగు ఎంతో లాభదాయకం. ఎకరానికి సుమారు 100-150 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. మార్కెట్లో ఇప్పుడు మేలైన వంగడాలు వచ్చాయి. ఎరుపు రంగు గడ్డకంటే లేత ఎరుపు రంగు ఉల్లికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎలాంటి మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో పాము పొడ తెగులు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- మాసన్న, దుప్పల్లి

✔ లీటరు నీటికి థప్లూజమిడ్ 0.75 మి.లీ లేదా హెక్సాకోనోజోల్ 2 మి.లీ లేదా ప్రొపికోనోజోల్ 1 మి.లీ లేదా ట్రైఫ్లాక్సీస్ట్రాబిన్ + టెబ్యూకోనోజోల్ 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? వేరుసెనగలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- బాలరాజు, నిర్వేన్

✔ న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో ఆకుమాడు తెగులు నివారణకు చర్యలు తెలపండి

- వెంకటయ్య, చెన్నారం

✔ లీటరు నీటిలో కాప్టాన్ 3 గ్రాములు లేదా కార్బండిజియం + మ్యాంకోజోబ్ 2.5 గ్రాములు లేదా ప్రొపికోనోజోల్ ఒక మి.లీ లేదా అజాక్సీస్ట్రోబిన్ + టెబ్యూకోనోజోల్ 1.2 మి.లీ మందును కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

- న్యూస్‌టుడే, మదనాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యకు కృషి

సినీనటి మంచు లక్ష్మి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, మౌలిక వసతుల కల్పనకు తమ సంస్థ కృషి చేస్తోందని టీచ్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, సినీనటి మంచు లక్ష్మి పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామంలో డిజిటల్‌క్లాస్ నిర్మాణం ప్రారంభించేందుకు వచ్చిన ఆమె సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పెగసిస్ సిస్టం కంపెనీ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. గతంలో గట్టు మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌ల నిర్మాణం చేపట్టామని.. త్వరలో మరో 20 పాఠశాలలు నిర్మిస్తామని ఆమె చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 140 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఈవో రవీందర్‌లు పాల్గొన్నారు.



గద్వాల కలెక్టర్ సంతోష్‌తో మాట్లాడుతున్న సినీనటి మంచు లక్ష్మి

శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన



ఉండవల్లి బస్వాపురంలో శిక్షణ అధికారులకు పూలమొక్కలు అందజేసి, బతుకమ్మతో స్వాగతిస్తున్న అధికారులు

ధరూరు, ఉండవల్లి, మానవపాడు, ఇటిక్యాల, న్యూస్‌టుడే: ధరూరు మండల పరిధిలోని ఉప్పేరులో శిక్షణ ఐఏఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాదు, జోగులాంబ గద్వాల జిల్లాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామానికి 5 మంది చొప్పున 125 మంది శిక్షణ అధికారులు వచ్చారు. 3 రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు, కనీస వసతుల కల్పన తదితర అంశాలపై నివేదిక రూపొందించనున్నారు.

- ఉండవల్లి మండలం బస్వాపురం గ్రామానికి శిక్షణ అధికారులు లోకేష్‌కుమార్ (ఐఎస్ఎస్), రామకృష్ణ శరన్ (ఐపీఎస్), ప్రతీక్ గహ్లోట్(ఐపీఎస్), అతుల్ కుమార్‌సింగ్ (ఐఆర్ఎస్ ఐటీ), హిమాన్షు త్యాగి (ఐఎఫ్ఓఎస్) సోమవారం వచ్చారు. మానవపాడు మండలానికి 5 మంది శిక్షణ ఐఏఎస్ అధికారులు రాజీవ్.కె, వల్లి.ఎన్, ప్రసన్నకుమార్.వి, విజయ్ లధా, సాయలి అశోక్ గైక్వాడ్‌లు మండలంలోని కలుకుంట్ల గ్రామానికి సోమవారం చేరుకున్నారు. ఇటిక్యాల మండలంలోని కోదండాపురంకు సోమవారం శిక్షణా సివిల్ సర్వీస్ అధికారులు వచ్చారు. 2021 బ్యాచ్‌కు చెందిన లోకేష్ యాదవ్ (ఐపీఎస్), డింపుల్ యాదవ్(ఐఎస్ఎస్), బస్వారాజ్ ఎం వాలీకర్(ఐపీవోఎస్), నిఖితా యాదవ్(ఐసీఎల్ఎస్), 2022 బ్యాచ్‌కు చెందిన ఇంద్రజిత్ సిరా(ఐఎఫ్‌వోఎస్)లు ఉన్నారు. మల్దకల్ మండల పరిధిలోని పెద్దతాండలో శిక్షణ ఐపీఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. వికాస్, పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, ఐఎఫ్ఓఎస్ ఆదాం మోహియిద్దీన్, ఐపీఓఎస్ పుష్కర వర్మ, ఐపీఎస్ హర్షత్‌కుమార్ ఆలావాత్, తాండాలో పర్యటించి ఆర్థిక, సామాజిక అంశాలపై ముచ్చటించారు.

శ్రీశైలంలో నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన ఉన్న జూరాల, సుంకేశుల జలాశయాలు పూర్తిగా నిండటంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్టు 5 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 1,17,539 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 51,324 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. శ్రీశైలం కుడి ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వార 66,203 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వార 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటి మట్టం 884.30 అడుగులకు, నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొలువులు ఇచ్చే కొత్త కోర్సులు

- టాటా సంస్థ భాగస్వామ్యంతో మూడు ఐటీఐల్లో అమలు
- 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ



ఐటీఐ కళాశాలలో కొత్త కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న యువతులు

న్యూస్‌టుడే, పాలమూరు: విస్తృత ఉపాధి అవకాశాలు లభించే ఆరు అధునాతన సాంకేతిక కోర్సులు పాలమూరు యువతకు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం దిగ్గజ కంపెనీ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రభుత్వ ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలు (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ - ఏటీసీ)గా ఉన్నతీకరిస్తున్నారు. తొలి విడతగా ఈ ఏడాది 28 కళాశాలలు ఎంపిక చేయగా అందులో మహబూబ్‌నగర్(బాలికల), మన్ననూర్, వనపర్తి ఐటీఐలు ఉన్నాయి.

ఒక్కో కళాశాలలో 172 సీట్లు : ఒక్కో కళాశాలలో ఆరు కొత్త కోర్సుల్లో కలిపి 172 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువత ప్రవేశాలకు అర్హులు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను అంతర్జాలం నుంచి స్వీకరిస్తారు. తర్వాత కోర్సులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి జిల్లాలో బాలికల ఐటీఐ కళాశాల మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే ఉంది. ఈ కోర్సుల్లో మూడేళ్ల పాటు టాటా ప్రతినిధులే శిక్షణ ఇస్తారు. తర్వాత వివిధ పరిశ్రమల్లో వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారు. ఎస్ఎస్‌సీ, కుల, బోనఫైడ్, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఫొటో స్కాన్ చేసి http://iti.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

23న పనులకు శంకుస్థాపన : మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బాలికలు, బాలురకు వేర్వేరుగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు వెచ్చించే నిధులను 85 శాతం టాటా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. వాటిలో అన్ని రకాల యంత్ర సామగ్రి, పరికరాలు, ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ఈ పనులకు ఈ నెల 23న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మహబూబ్‌నగర్‌లో శంకుస్థాపన చేయనున్నారు.



కోర్సు	సీట్లు
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ - ఏడాది	40
ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ - ఏడాది	40
ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్ - ఏడాది	20
బేసిక్ డిజైనర్, వర్చ్యువల్ వెరిఫైర్ - రెండేళ్లు	24
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్ - రెండేళ్లు	24
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ - రెండేళ్లు	24

సద్వినియోగం చేసుకోవాలి.. : రాబోయే కాలంలో భారీ డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుంటే కొలువులు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం, టాటా కంపెనీ కలిసి నిర్వహించే ఆరు కొత్త కోర్సులను ఉమ్మడి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి. అర్హులందరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి 83742 50330, 95500 54418, 98484 66028 నంబర్లలో సంప్రదించొచ్చు.



- గోపాల్ నాయక్, ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, మహబూబ్‌నగర్

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

వివరాలు గోప్యంగా ఉంచిన ఉపాధ్యాయులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన బిజినేపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. శాయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన చిన్నారుల్లో 15 మంది వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల వద్ద వదిలిన ఉపాధ్యాయులు ఎంఈవోకు గాని, తల్లిదండ్రులకు గాని సమాచారం ఇవ్వకుండానే సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో కొందరు విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే వేచి ఉన్నారు. గ్రామస్థులు ఆరా తీయడంతో విషయం బయటకు తెలిసింది. ఎంఈవో రఘునందన్‌శర్మను వివరణ కోరగా, విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానన్నారు.



శాయిన్‌పల్లి పాఠశాల వద్ద అస్వస్థతకు గురైన విద్యార్థులు

ఆటో ఢీకొని మహిళ మృతి

ముగ్గురు పిల్లలకు గాయాలు

కృష్ణా, న్యూస్‌టుడే : హిందుపూర్, ట్రైరోడ్ మధ్య ఆటో ఢీకొని కర్రెమ్మ(60) అనే మహిళ మృతి చెందింది. కృష్ణా పోలీసుల కథనం ప్రకారం సోమవారం సాయంత్రం కర్ణాటకలోని శక్తినగర్ నుంచి ప్రయివేటు పాఠశాల విద్యార్థులను హిందుపూర్‌కు ఆటో తీసుకువస్తుండగా మహిళ అడ్డం రావడంతో ఆటో అదుపు తప్పి ఆమెను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ కర్రెమ్మను ప్రయివేటు వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలిది గుడేబల్లూర్‌గా పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.

బాలికతో వెట్టి.. ఆపై దొంగతనం నెపం

- మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం
- జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ఓ సీడ్ ఆర్గనైజర్ తన ఇంట్లో బాలిక(16)తో వెట్టి చాకిరి చేయించుకోవడంతోపాటు దొంగతనం నెపం మోపడంతో ఆ బాలిక పురుగు మందు తాగింది. సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరల్‌గా మారిన ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గద్వాలలో నివాసం ఉంటున్న సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో గత కొన్నేళ్లుగా పని చేస్తోంది. తన ఇంట్లో బంగారు ఆభరణాలు పోయాయని, ఇంట్లో పని చేసే బాలికే ఈ పనికి పాల్పడిందని మల్దకల్ ఠాణాలో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఠాణాకు పిలిపించి విచారించారు. తర్వాత చోరీ ఘటన తమ పరిధిలో లేదంటూ సీడ్ ఆర్గనైజర్‌కు వివరించారు. తాను దొంగతనం చేయకున్నా నింద మోపారని మనస్థాపం చెందిన బాలిక ఈనెల 12న తన ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఏపీలోకి కర్నూలుకు తీసుకెళ్లారు. బాలిక ఆరోగ్యం మరింతగా విషమించడంతో వైద్యులు ఏఎంసీలో ఉంచి వెంటిలేటరుపై చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో బాలిక తల్లి మల్దకల్ ఠాణాలో ఇంటి యజమానిపై ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గద్వాల డీఎస్పీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా సంఘటనపై విచారణ జరుపుతున్నామని, బాలిక తల్లి ఫిర్యాదుపై వెట్టిచాకిరి చేయించుకుని దొంగతనం నెపంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సీడ్ ఆర్గనైజర్‌పై మల్దకల్ ఠాణాలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు కింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండే గుర్తుతెలియని పురుషుడు బండమీదిపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00



అమరచింత: గుంతలు పడి ధ్వంసమైన బీటీ రహదారి

సమస్య: పట్టణం నుంచి ఉంద్యాల గ్రామం వరకు 10 కిలో మీటర్ల బీటీ రహదారి పలు చోట్ల గుంతలు పడి ధ్వంసమైంది. పలు చోట్ల వర్షపు నీరు నిలుస్తోంది. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

- వెంకటేష్, అమరచింత

సమాధానం: ప్రభుత్వం వర్షాకాలంలో ధ్వంసమైన బీటీ రహదారుల మరమ్మతుకు నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి అయితే పట్టణం నుంచి ఉంద్యాల గ్రామం వరకు బీటీ రహదారి మరమ్మతులు చేయిస్తాం.

-నరేష్, ఏఈ, అమరచింత

అమరచింత, న్యూస్‌టుడే

తెరపై ఈనాడు

శ్రీనివాస: దేవర వెంకటేశ్వర: విశ్వం
శ్రీరామ: వేట్టయన్ – న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి



మదనాపురంలో...

మదనాపురం, న్యూస్‌టుడే: మదనాపురం పోలీస్ ఠాణాలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పోలీస్ అమరవీరుల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సై శేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు గాంధీ చౌక్ కూడలిలో...

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఏఎస్సై నాగరాజు, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త గోపి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వాహణలో ప్రాణాలు వదిలిన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బద్రి నాయక్, ఎస్‌బీ కానిస్టేబుల్స్ లక్ష్మీకాంత్‌రెడ్డి, శేఖర్, కానిస్టేబుల్స్ విజయలక్ష్మీ, పుష్ప, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆత్మకూరు పట్టణంలో స్మారక ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఠాణా నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా గాంధీచౌక్ కూడలి వరకు కొనసాగింది. అమరులైన పోలీసు సిబ్బందికి నివాళులర్పించారు. ఏఎస్సై బీచుపల్లి, సిబ్బంది బాలేశ్వర్‌రెడ్డి, మునీశ్వర్‌రెడ్డి, వెంకటన్న గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఖిల్లాగణపురం: పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న గ్రామస్థులు, పోలీసులు

పాన్‌గల్‌లో 10.5మిమీ వర్షం

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే: పాన్‌గల్ మండలంలో సోమవారం ఉదయం 10.5మిమీ వర్షపాతం నమోదయ్యింది. ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి సోమవారం ఉదయం 8.30గంటల వరకు జిల్లాలోని పలు మండలాలలో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు 9.5మిమీ, శ్రీరంగాపురం 7.8మిమీ, గోపాల్‌పేట 5.8మిమీ, కొత్తకోట 5.5మిమీ, అమరచింత 4.3మిమీ, అమరచింత 0.5మిమీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదని టీజీడీపీఎస్ ఏడీ మక్సూద్‌మియా తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

గోపాల్‌పేట : ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం గోపాల్‌పేటలో రైతు వేదికలో మహిళా సంఘాల బుక్‌కీపర్లు, ఇన్‌ఛార్జులు, పీఏసీఎస్ సిబ్బందికి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సన్నరకాలను గుర్తించేందుకు వాడే డయల్ మైక్రోమీటరు గురించి ఏఈవోలు వారికి వివరించారు. సన్న రకాల వరిగింజల పొడవు 6 మీమి కంటే తక్కువగా, వెడల్పు 2మిమీ కంటే తక్కువగా ఉండాలని సూచించారు. ఏఈవోలు నాగరాజు, లోకేశ్వరి, శిరీష, అంజనమ్మ, ప్రకాశ్, ఏపీఎం చంద్రకళ పాల్గొన్నారు.

గ్రామాల్లో బాలలపరిరక్షణ కమిటీలు

వనపర్తిగ్రామీణం : బాల బాలికల పరిరక్షణ కోసం గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి సీడీపీవో హజీరాబేగం తెలిపారు. సోమవారం మండలంలోని ఆంజనగిరి పంచాయతీలో జిల్లా మహిళా సాధికారిక కేంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన బాలల పరిరక్షణ కమిటీ కార్యక్రమంలో పాల్గొన్ని మాట్లాడారు. గ్రామాల్లోని బాల బాలిక పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీల ద్వారా బాల బాలికల కల్పించాల్సిన హక్కులను ఈ కమిటీల ద్వారా సమీక్షించాల్సి ఉంటుందన్నారు. అనంతరం గ్రామ కమిటీ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు. జిల్లా మహిళా సాధికారత మిషన్ కో ఆర్డినేటర్ భాస్కర్, సిబ్బంది రాంబాబు, సుమా, స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

స్వీపర్‌కు సన్మానం

పాన్‌గల్, న్యూస్‌టుడే: మండలంలోని మాధవరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న మండ్ల వెంకటయ్య కుమార్తె వనిత ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడంతో సోమవారం ఎమ్మార్సీ భవనంలో వెంకటయ్యను ఎంఈవో శ్రీనివాసులు సన్మానించారు. వీపనగండ్ల మండలం బొల్లారం ప్రాథమిక పాఠశాలలో ఆమె విధుల్లో చేరడంతో అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ గోవింద్, ఎంసీ శేఖర్ పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ

ఖిల్లాగణపురం: సోళీపూర్, మానాజీపేట, కమాలోద్దీన్‌పూర్ గ్రామాల్లోని మత్స్యకారులకు సోమవారం జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ భరత్ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోళీపూర్ పెద్ద చెరువులో 1,42,500 కమాలోద్దీన్‌పూర్ చెరువులో 94,000, మానాజీపేట చెరువులో 28,000 చేప పిల్లలను వదిలారు. మత్స్యకార సభ్యులు రాజు, రవి, మత్స్యకారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తుంగభద్రలో 48,370 క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్ : తుంగభద్రలో సోమవారం 48,370 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 11 అడుగుల ఎత్తులో ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధాన కాల్వకు 8.1 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి 5 అడుగులుగా ఉంది.

ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేయాలని వినతి

అమరచింత, న్యూస్‌టుడే: అమరచింత మండల కేంద్రంలో ప్రజల సౌకర్యం కోసం ఎస్‌బీఐ బ్యాంకు ఏర్పాటు చేయాలని భాజపా జిల్లా నాయకులు మేర్వరాజు, పట్టణ అధ్యక్షుడు శ్యామ్ భాస్కర్, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు సోమవారం ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టికి వినతి పత్రం సమర్పించారు. మండలంలో 35 వేల జనాభా ఉందని ఒక్కటే బ్యాంకు ఉండటంతో రైతులు, కూలీలు, విద్యార్థులు బ్యాంకు సేవలకు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. దేశంలో కొత్తగా ఎస్‌బీఐ బ్యాంక్స్ ఏర్పాటు చేస్తే 62 శాఖలో అమరచింత మండలం ఉండే విధంగా కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ పేర్కొన్నారు.

● కుడకు ఆదాయ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదుట ఉన్న కుడకు స్థలాన్ని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాటిని రద్దు చేసి ప్రభుత్వ స్థలంగా బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం సమర్పించినట్లు భాజపా నాయకులు తెలిపారు.

25న కవి సమ్మేళనం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వనపర్తి బాలుర డిగ్రీ కళాశాలలో ఈనెల 25న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలుగు భాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు బడే సాబ్ తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల కవులు 9441357400, 8341249673 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కార్మికుల వేతనాలు మంజూరు చేయాలి

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలని భారాస, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. వనపర్తి పురపాలికలో పలువురు కార్మికులు నీటి సరఫరా, డ్రైవర్లు దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. సోమవారం పురపాలిక కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మికులకు వేతనాలివ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మికులతో పాటు భారాస, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన వాసవి డిజిటల్ యజమాని శివ ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబ పరిస్థితి తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫ్లెక్సీ ప్రింటర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి సంఘం తరపున రూ.4 లక్షల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి ఖాదీర్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, పాష పాల్గొన్నారు.

● పట్టణంలోని ప్రజా వైద్యశాలలో కాంపౌండర్‌గా విధుల నిర్వహించిన నరసింహ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆయన ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న డాక్టర్ మురళీధర్ రూ.50వేల, ఆసుపత్రి సిబ్బంది రూ.77,600 అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పట్టణం చిట్యాల రహదారిలోని కమలానగర్ నుంచి రాయిగడ్డ వెళ్లే దారిలో శిథిలావస్థలో ఉన్న ఇనుప స్తంభాలను మార్చడం కోసం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్పీడీసీఎల్ పట్టణ ఏఈ రాజయ్యగౌడ్ తెలిపారు. పట్టణంలోని కమలానగర్, రాయిగడ్డ, బ్రహ్మంగారివీధి, రాంనగర్‌కాలనీ, చిట్యాల రోడ్డులోని చింతలహనుమాన్, ర్యాంకర్స్ స్కూల్ ప్రాంతంలోని విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

చరవాణి అప్పగింత

గోపాల్‌పేట : 2023వ సంవత్సరం నవంబరు 2వ తేదీన పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కనిపెట్టారు. ఎస్సై హరిప్రసాద్ కథనం ప్రకారం..గోపాల్‌పేటకు చెందిన బాలరాజు అనే వ్యక్తి గత సంవత్సరం నవంబరు 2న తన చరవాణిని పోగొట్టుకున్నాడు. అదే రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశాడు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చరవాణి ఆచూకీని పోలీసులు కనుగొని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బాధితుడు బాలరాజుకు ఫోన్‌ను అప్పగించామని ఎస్సై తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల వివాహాలను అరికట్టేందుకు రూపొందించిన గోడపత్రికలను కలెక్టర్ అదనపు కలెక్టర్లు సంచిత్‌గంగ్వార్, నగేశ్, ఆర్డీవో పద్మావతి, జడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీవో పీడీ ఉమాదేవి, డీడబ్ల్యూవో లక్ష్మమ్మతో కలిసి ఆవిష్కరించారు.

కొత్తకోట గ్రామీణం : కనిమెట్టలో బాల్య వివాహాలపై పాఠశాల విద్యార్థినులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య మాట్లాడుతూ.. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు వచ్చాక వివాహాలు జరిపించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తిరుమలేశ్వరి, సువర్ణ, దీపికలతో బాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్లుగా ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కృష్ణ, గ్రామస్థులు రాఘవేంద్ర, వెంకటేశ్, మహిళలు, విద్యార్థులు, బాలికలు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: అయోడిన్ లోపం వల్ల మహిళల్లో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ పేర్కొన్నారు. సోమవారం నాగవరం మహిళ సంక్షేమ డిగ్రీ కళాశాలలో ప్రపంచ అయోడిన్ లోపం నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల మహిళల్లో జుట్టు రాలడం, బరువు తగ్గడం, చర్మం పొడిబారడం, గర్భం సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ కొండ, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, డాక్టర్ విద్యరాణి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు

పెబ్బేరు, న్యూస్‌టుడే: మండలంలోని యాపర్ల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి రత్నకుమార్ గౌడ్ పదోతరగతి విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఈ అల్పాహారం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున్న మూడు నెలలపాటు విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పాఠశాల జీహెచ్ఎం శంకర్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమన్నారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ జయప్రదం చేయండి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: 50 ఏళ్ల స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో ఈ నెల 24న నిర్వహించే సభను జయప్రదం చేయాల్సిందిగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రాంగణాల్లో సోమవారం స్వర్ణోత్సవ సభ గోడ పత్రికను విడుదల చేసిన సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నాయకులు మోసీన్, అలీ, సందీప్, ఉషారాణి, రేవతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

జూరాలకు వరద



ధరూరు న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 1.13లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దిగువకు 16గేట్లు, జల విద్యుదుత్పత్తి ద్వారా మొత్తం 1.16లక్షల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 55 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 54 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 88వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో దిగువకు 91వేల క్యూసెక్కుల వరదను వదులుతున్నారు. మరో రెండు మూడు రోజుల పాటు జూరాలకు వరద కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



కమిషనర్ శశిధర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు పురపాలికలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుర కమిషనర్ చికినె శశిధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత పుర కార్యాలయం సమీపంలో స్థిరాస్తి వ్యాపారులు మేజర్ పంచాయతీకి స్వాధీన పర్చిన పది శాతం భూమిని అక్రమార్కులు ఆక్రమించి, ప్రహరీ నిర్మాణ చేసినా పురపాలిక యంత్రాంగంలో చలనం లేని దుస్థితి నెలకొందని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. వెంటనే పురపాలిక యంత్రాంగం ఆక్రమణకు గురైన పది శాతం భూమిని తిరిగి స్వాధీనం చేసుకోకుంటే కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే వాటికి శ్రీహరి దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి గంగాధర్‌గౌడ్, పట్టణ నాయకులు మణివర్ధన్‌రెడ్డి, రఫీక్, గంగాధర్, నిరంజన్, ఖాజ, రాజు, వంశీ, శ్రీకాంత్, రాజారెడ్డి, రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



శ్రీరంగాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు చేసుకొన్న, అందుకు ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని ఇన్‌ఛార్జి సీడీపీవో బాలీశ్వరమ్మ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీరంగాపురంలోని పంచాయతీ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీలను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో బాలల హక్కులను కాపాడేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మన అందరి బాధ్యత అన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధికారులు కవిత, అరుణ, లక్ష్మీనారాయణమ్మ, నందకిశోర్, కవిత, శాంతబాయి, మంజూలారాణి, రాధ, కైసర్‌బేగం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



కొత్తకోట : రాయినిపేట తండాలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న భక్తులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రాయినిపేట తండాలో సోమవారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆభయాంజనేయస్వామి ధ్వజస్తంభ, నాభిశిల ప్రతిష్ఠాపనలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ వద్ద ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని రాయినిపేటకు చెందిన షర్ఫుద్దీన్ అందించారు. తండావాసులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం

ఖిల్లాగణపురం : మండల కేంద్రంలోని కుమ్మరిగేరి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బొడ్రాయి నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ప్రతిష్ఠించిన దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామస్థులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు అభిషేకం, హోమంతో పాటు పసుపు, కుంకుమలతో బొడ్రాయికి పూజలు నిర్వహించారు.

పిన్నంచర్లలో జలాధివాసం..

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో సోమవారం ఆంజనేయస్వామి విగ్రహ జలాధివాసం ప్రత్యేక పూజలను భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుతున్న క్రమంలో ఇప్పటికే నూతన ఆలయ నిర్మాణ పనులు కొనసాగుతుండగా గర్భగుడిలోని మూల విగ్రహాన్ని ఆలయ నిర్మాణ పనులు పూర్తి అయ్యే వరకు నీటిలో నిలువ ఉంచేందుకు ఈ క్రతువును ఏర్పాటు చేశారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య గర్భగుడిలోని ఆంజనేయస్వామి విగ్రహాన్ని తొట్టిలో ఉంచి నీటితో నింపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటేష్, విజయలక్ష్మి, గ్రామ పెద్దలు ఉప తహసీల్దార్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



జలాధివాసం సందర్భంగా పూజల్లో పాల్గొన్న గ్రామ పెద్దలు

సేవలకు గుర్తింపునివ్వడం అభినందనీయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి కృషిచేసిన వ్యక్తులను గుర్తించి వారికి గ్రామరత్న అవార్డులను అందజేసి సత్కరించడం అభినందించాల్సిన విషయమని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బుద్ధారం గ్రామంలో స్థానిక విశ్వవాణి గ్రామాభివృద్ధి సంఘం వారు ఏర్పాటు చేసిన గ్రామరత్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అవార్డు గ్రహీతలను సత్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అడిగిన పలు అభివృద్ధి పనులు, సమస్యలను ఆయన ప్రస్తావించారు. బుద్ధారం జలాశయం నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు రూ.12లక్షల పైగానే నష్టపరిహారం అందేలా చూస్తానని, జాగీర్దారు కాలువకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తానని హామీనిచ్చారు. గ్రామంలో ఎంతమందికి కచ్చితంగా నివాసగృహాలు లేవో వారిని గుర్తించి జాబితాను అందజేస్తే వారికి ఇళ్లు మంజూరు చేయిస్తానన్నారు. యంగ్ ఇండియా పేరుతో బుద్ధారంగండిలో ఏర్పాటు చేయనున్న ఎడ్యుకేషన్ హబ్‌కు త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. నాయకులు సత్యశీలారెడ్డి, పద్మ, అమర్‌నాథ్, అచ్యుత రామారావు, శేఖర్‌గౌడ్, పుల్యానాయక్, వెంకటయ్య, పెంటారావు, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్‌జి 445 నూతన జిల్లా కమిటీని ఏర్పాటైందని జిల్లా అధ్యక్షుడు ఎద్దుల సత్యం తెలిపారు. కార్యదర్శిగా వరదరాజు, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా రవికుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడుగా రవికాంత్‌రెడ్డి, కోశాధికారి కురుమూర్తి ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా 327 యూనియన్ నుంచి పలువురు నాయకులు సంఘంలో చేరారని ఆయన తెలిపారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్

వనపర్తి పట్టణం : కాంగ్రెస్ ప్రభుత్వ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పుట్ట బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మత్స్య సహకార సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీసీ కులగణనలో ముదిరాజులు ప్రధాన వృతి చేపలు పట్టడం అని నమోదు చేయించాలని సూచించారు. జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు సంద రంగస్వామి, నాగేంద్రం, కృష్ణయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

'నిందితులను పట్టుకోవడంలో పోలీసుల విఫలం'



చిన్నంబావి ఠాణాలో భాజపా నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

చిన్నంబావి, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన భారాస కార్యకర్త శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని నిరసిస్తూ భాజపా నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎల్లేని సుధాకర్‌రావు, శ్రీధర్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డితో కలిసి మండలంలోని ఠాణా ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హత్య జరిగి ఐదు నెలలకు పైగా గడుస్తున్నా, నేటికి నిందితులను ఎందుకు పట్టుకోవడం లేదని పోలీసులను ప్రశ్నించారు. 20 రోజుల్లోగా నిందితులను అదుపులోకి తీసుకోకుంటే బాధితుల తరపున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు ఠాణాకు చేరుకొని భాజపా నాయకులతో మాట్లాడారు. త్వరలో కేసును ముగిస్తామని చెప్పడంతో వ్యవహారం సద్దుమణిగింది. భాజపా నాయకులు ధారాసింగ్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా భాజపా సభ్యత్వాలు

వనపర్తిగ్రామీణం : గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాజపా సభ్యత్వాలు తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని భాజపా రాష్ట్ర నాయకులు పురుషోత్తంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కడుకుంట్ల, చిమనగుంటపల్లి గ్రామాల్లో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పురుషోత్తంరెడ్డి చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకటేశ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



భాజపా సభ్యత్వ నమోదు చేయిస్తున్న రాష్ట్ర భాజపా నాయకులు పురుషోత్తం రెడ్డి

కేంద్ర ప్రభుత్వం విధానాలన్నీ సంపన్నుల కోసమే



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలన్నీ సంపన్నులకే అనుకూలంగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరళీకరణ విధానాల పేరుతో పెద్ద పెద్ద సంస్థలకు లాభాలు చేకూర్చే విధానాలను కేంద్రం అనుసరిస్తుందన్నారు. బ్యాంకులలో రుణాలు తీసుకొని విదేశాలకు పారిపోయిన వారికి పలువురికి కేంద్రం మాఫీ చేసిందని.. పేదలు, రైతులు, కూలీలు, కార్మికులు అప్పులు తీసుకొని కట్టలేని వారిని జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి కురుమయ్య, పట్టణ కమిటీ బాధ్యులు పరమేశ్వర్‌చారి, పట్టణ కమిటీ సభ్యులు మదన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



శ్రీరంగాపురం సమీపంలోని ప్రభుత్వాసుపత్రి దగ్గర మిషన్ భగీరథ పైపులైన్ గేట్ వాల్ మరమ్మతులకు గురై కొన్ని వారాలు గడుస్తుంది. నేటికి గేట్‌వాల్‌కు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగా పోతుంది. కాలానుగుణ వ్యాధులు సోకుతున్నాయని, ఇలాంటి కలుషిత నీరు తాగితే వ్యాధులు పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గేట్‌వాల్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ మహేశ్వరిని వివరణ కోరగా.. గతంలో గేట్‌వాల్ మరమ్మతులకు గురైతే మరమ్మతులు చేయించాం. ప్రస్తుతం గేట్‌వాల్ మరమ్మతులు చేయడానికి రావడం లేదు. కొత్తది తెచ్చి అమర్చి సమస్య పరిష్కరిస్తాం. -న్యూస్‌టుడే, శ్రీరంగాపురం